రబీ రారాజు!

పంటలకు గిట్టుబాటు ధరలు లేకపోవడంతో డీలా పడుతున్న రైతులను మొక్కజొన్న ఆదుకుంటోంది. ఖరీఫ్, రబీలో మొక్కజొన్నే రారాజుగా నిలిచింది. సాగు చేసిన రైతుల పంట నిజంగానే పండింది. గిట్టుబాటు కూడా అవుతోంది. ఎకరాకు రూ.50 వేల నుంచి గరిష్ఠంగా రూ.లక్ష దాకా మిగులు కనిపిస్తోంది.

- పల్నాట సిరులు కురిపిస్తున్న మొక్కజొన్న
- ప్రయివేటు కంపెనీల ప్రోత్సాహంతో సాగు
- ఎకరాకు రూ.లక్ష వరకు మిగులు చూస్తున్న రైతులు
- ఖరీఫ్, రబీ సీజన్‌ల్లో కర్షకులు లాభాల బాట..
- కంది, మిర్చి రైతులకు తలపోటుగా గిట్టుబాటు ధర


సాగులో ఉన్న మొక్కజొన్న పంట

కారెంపూడి: ప్రయివేటు విత్తన కంపెనీలు రైతులకు బాండ్లు ఇచ్చి మొక్కజొన్న పంట సాగు చేయిస్తున్నాయి. దీంతో పాటు పెట్టుబడిగా ఎకరాకు రూ.15 నుంచి రూ.20 వేల వరకు అందించాయి. విత్తనాలు, గడ్డి మందు, పురుగు గుళికలు కంపెనీలే సరఫరా చేస్తామనడంతో రైతులు పంట సాగుకు బాగా ముందుకు వచ్చారు. ముందుగా చెప్పినట్లుగా క్వింటా రూ.3,700కు కొంటామని చెప్పి అలాగే కొనుగోళ్లు చేస్తుండడంతో రైతులకు లాభించింది. ఆయా కంపెనీల ప్రతినిధుల పర్యవేక్షణలో రైతులు తగిన సస్యరక్షణ చర్యలు తీసుకుని మంచి దిగుబడులు సాధించారు.

అనుకూలించిన వాతావరణం

వాతావరణం కూడా మొక్కజొన్న పంటకు అనుకూలించింది. ఎకరాకు 25 నుంచి గరిష్ఠంగా 42 క్వింటాళ్ల దాకా దిగుబడులు వస్తున్నాయి. కంపెనీలు కూడా ముందు ఇచ్చిన హామీ ప్రకారం క్వింటా రూ.3 వేల నుంచి గరిష్ఠంగా రూ.3,700 దాకా రేటు ఇచ్చి కొంటున్నాయి. దీంతో రైతుకు మిగులు కన్పిస్తోంది.వారిలో సంతోషం వ్యక్తం అవుతోంది. పల్నాడు వ్యాప్తంగా వివిధ గ్రామాల్లో సుమారు 2,400 ఎకరాల దాకా సీడ్ కోసం మొక్కజొన్న సాగు జరిగింది.

అందుకే ప్రత్యేకం

నాలుగు ప్రముఖ కంపెనీలు విత్తన మొక్కజొన్నను సాగు చేయించాయి. ఇలా ప్రత్యేకించి ఎందుకు చెప్పుకోవాల్సి వస్తోందంటే మిర్చి దిగుబడులు అంతంత మాత్రంగానే ఉన్నాయి. దానికి తోడు ధర లేకపోవడం రైతులకు కష్టాల్లోకి నెట్టేసింది. అలాగే వరి పంటలో కూడా పెట్టుబడులు పెరగడంతో గిట్టుబాటు అంతంత మాత్రంగానే ఉంది. ఇక ఖరీఫ్ కంది దిగుబడులు కూడా బాగా తక్కువగా ఎకరాకు నాలుగైదు క్వింటాళ్లు మాత్రమే వస్తున్నాయి. దానికి తోడు రేటు కూడా రూ.7 వేల లోపే పలుకుతోంది. రబీ కంది పైర్లు ఆశాజనకంగా ఉన్నా ధర లేకపోవడంతో అందులో కూడా మిగులు ఉంటుందో లేదోననే బెంగతో రైతులున్నారు. దీంతో ఈ ఏడాది మొక్కజొన్న వేసిన రైతులకు మాత్రం మిగులు కన్పిస్తుండడం విశేషం. వాస్తవంగా పల్నాడులో ఇలా సీడ్ మొక్కజొన్న సాగు మూడేళ్ల క్రితం ప్రారంభమైంది. అయితే అప్పట్లో చాలా తక్కువ విస్తీర్ణంలో సాగయ్యేది.

కానీ, ఈ ఏడాది ప్రముఖ కంపెనీలన్నీ పల్నాడులో మొక్కజొన్న సాగు చేయించాలని, నాణ్యత బాగుందని ముందుకు రావడంతో పల్నాడులో అనేక గ్రామాలలో మొక్కజొన్న సాగు జరిగింది. ఇదిలా ఉంటే అలాగే చాలా మంది రైతులు కంపెనీలతో సంబంధం లేకుండా స్వతంత్రంగా మరో రెండు వేల ఎకరాలలో మొక్కజొన్నను సాగు చేశారు. వారికి కూడా మంచి దిగుబడులతో పాటు అమ్మకాలకు ఇబ్బందిలేకుండా మంచి ధరతో పంటను అమ్ముకుంటున్నారు.

ఎకరాకు రూ.లక్ష మిగులు

నేను మూడెకరాల్లో అజిత్ కంపెనీ ప్రోత్సాహంతో మొక్కజొన్న సాగు చేశాను. ఎకరాకు 36 క్వింటాళ్ల చొప్పున దిగుబడి వచ్చింది. క్వింటా రూ.3,700 రేటుకు కంపెనీ వారే కొన్నారు. పెట్టుబడి పోను నాకు ఎకరాకు రూ.లక్ష దాకా మిగులుతాయి. సంతోషంగా ఉంది.

– కొర్రపాటి మురళి, రైతు, కారెంపూడి

30 క్వింటాళ్ల దిగుబడి ఆశిస్తున్నా..

నేను ఎకరన్నరలో మొక్కజొన్న పంట సాగు చేశాను. కండెలు తీయించాలి. ఎకరాకు 30 క్వింటాళ్ల పైనే దిగుబడి వస్తుందని ఆశిస్తున్నాను. మిర్చి కూడా మూడెకరాలు వేశాను. దానికి రేయింబవళ్ల శ్రమించినా ధర లేకపోవడంతో గిట్టుబాటు కాలేదు. కాని రబీలో వేసిన మొక్కజొన్నలో మిగులు కన్పించేలా ఉంది.

– బండారు తిరుపతిరావు, రైతు, ఒప్పిచర్ల

క్లుప్తంగా

వైభవంగా వీర బ్రహ్మేంద్ర స్వామి కల్యాణ మహోత్సవం



విజయపురిసౌత్: స్థానిక మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి దేవస్థానంలో పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి, గోవిందమాంబ కల్యాణ మహోత్సవం శనివారం వైభవంగా నిర్వహించారు. అర్చకులు వడ్లమాని బాల సుబ్రహ్మణ్యాచారి ఆధ్వర్యంలో స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కల్యాణం వేద మంత్రాల నడుమ అంగరంగ వైభవంగా నిర్వహించారు. 12 మంది దంపతులు పీటల మీద కూర్చొని వేడుకను జరిపించారు. మధ్యాహ్నం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం స్వామి వారిని గ్రామ వీధుల్లో ఊరేగించారు. ఆలయ కమిటీ సభ్యులు ఆడెపు కోటయ్య, ఆడెపు బ్రహ్మం, ఆడెపు వెంకటేశ్వర్లు, పంగా వెంకటేశ్వర్లు, ఎం.దిబ్బయ్య, పిల్లి నాయక్, బ్రహ్మం, లింగమ్మ పాల్గొన్నారు.

తిరునాళ్ల ఆదాయం రూ.5,13,861



సత్రశాల(రెంటచింతల): మండలంలోని సత్రశాల గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి దేవస్థానం నందు మహా శివరాత్రి వేడుకల ఆదాయం గతేడాది కన్నా రూ.1,08,068 పెరిగినట్లు సత్తెనపల్లి ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ వి.లీలావతి శనివారం తెలిపారు. గతేడాది హుండీ కానుకలు రూ.1,86,711, చదివింపులు రూ.29,832, టికెట్లు ద్వారా రూ.1,89,250, మొత్తం రూ.4,05,793 ఆదాయం వచ్చిందని తెలిపారు. ఈ ఏడాది హుండీ కానుకలు రూ.2,14,095లు, చదివింపులు రూ.46,066లు, విరాళాలు రూ.6,600, కల్యాణ రుసుం రూ.4,160లు, టికెట్లు ద్వారా రూ. 2,42,940, మొత్తం ఆదాయం రూ. 5,13,861 వచ్చినట్లు వెల్లడించారు. హుండీల కానుకల లెక్కింపు కార్యక్రమంలో ఈవో గాదె రామిరెడ్డి, ఉత్సవ కమిటీ చైర్మన్ గుండా శివయ్య, దేవస్థానం ప్రధాన అర్చకుడు చిట్టేల మల్లికార్జునశర్మ, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రంతో ఆరోగ్యం పదిలం

పిడుగురాళ్ల: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే ఆరోగ్యం పదిలంగా ఉంటుందని మున్సిపల్ కమిషనర్ పర్వతనేని శ్రీధర్ తెలిపారు. స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రతి మూడవ శనివారం ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించడంలో భాగంగా శనివారం ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ... పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. ప్రజలు తమ నివాస ప్రాంతాల్లో పరిశుభ్ర వాతావరణాన్ని ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. వ్యర్థాలు రోడ్లపై వేస్తే చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనలు

శావల్యాపురం: జాతీయ సైన్సు దినోత్సవం సందర్భంగా రామా పబ్లిక్ స్కూల్లో రెండు రోజుల నుంచి జరుగుతున్న విద్యా వైజ్ఞానిక ప్రదర్శన కార్యక్రమం శనివారంతో ముగిసినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ కె.రత్నకుమారి తెలిపారు. ఈసందర్భంగా చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు మేనేజరు వలేటి శివకృష్ణ పాల్గొని మాట్లాడుతూ ప్రాథమిక స్థాయి నుంచే విజ్ఞాన శాస్త్ర భావనలు,విశ్లేషణాత్మక నైపుణ్యాలను ఉపాధ్యాయులు బోధించాలన్నారు. అనంతరం వివిధ ఉత్తమ నమూనాలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ కేవీఆర్ మోహన్‌చందు, డైరెక్టరు అజిత్‌చందు పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు టీకా



నూజెండ్ల: మండలంలోని పుచ్చనూతల గ్రామంలో గాలికుంటు టీకా కార్యక్రమం శనివారం ప్రారంభించినట్లు పశువైద్యాధికారి శివాజీ తెలిపారు. ఈసందర్భంగా మాట్లాడుతూ జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా మండలంలోని 27 గ్రామపంచాయతీల్లో పశువులకు గాలికుంటు నివారణ టీకాను ఉచితంగా చేస్తున్నట్లు తెలిపారు.గాలికుంటు సోకిన పాడిగేదలలో పాల ఉత్పత్తి పూర్తిస్థాయిలో తగ్గుతుందని పేర్కొన్నారు. ఈనెల 31 వరకు అన్నీ గ్రామాల్లో ఈకార్యక్రమం జరుగుతుందని వెల్లడించారు.

ఆత్మ విశ్వాసంతో ఉన్నత శిఖరాలకు



రెంటచింతల: ప్రతి విద్యార్థి ఆత్మ విశ్వాసంతో కృషి చేస్తే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చునని వైఆర్ఎస్ ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ యేచూరి వెంకట సైదయ్య అన్నారు. శనివారం పాఠశాలలో పద తరగతి విద్యార్థులకు ఫేర్‌వెల్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విశ్వాసం కోల్పోకుండా నమ్మకంగా పనిని తలపెట్టినప్పుడు తప్పక విజయవంతం అవుతుందన్నారు. పలువురు ప్రముఖ వ్యక్తుల జీవితాలను ఉదాహరించారు. పరీక్షల సమయంలో ఒత్తిడికి లోనుకావద్దని, ఒక లక్ష్యంతో చదువుకుని ప్రయోజకులు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం కొత్తా చంద్రశేఖర్, పాఠశాల కమిటీ అధ్యక్షుడు బద్దిగం అప్పిరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శ్రీశైలానికి శివస్వాములు

గురజాల : పలువురు శివ స్వాములు కాలి నడకన శ్రీశైలం బయలుదేరారు. నగర పంచాయతీ పరిధిలోని భద్రకాళీ సమేత వీరభద్ర స్వామి వారి దేవస్థానం నుంచి పలువురు శివ స్వామి మాలధారులు జ్యోతిర్ముడి శిరస్సున ధరించి బయలుదేరారు. 9 మంది శివ స్వాములు కాలినడకన మాచర్ల మీదుగా శ్రీశైలం బయలుదేరారు.

ఇంటర్మీడియెట్ పరీక్షలు ప్రారంభం


గురజాల ప్రభుత్వ జూనియర్ కళాశాల కేంద్రం వద్ద విద్యార్థులు


పిడుగురాళ్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద బందోబస్తులో పోలీసు సిబ్బంది


దాచేపల్లి: నారాయణపురంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద విద్యార్థులు

గురజాల రూరల్ : ఇంటర్మీడియట్ పరీక్షలు శనివారం నుంచి ప్రారంభమైయ్యాయి. మొదటి సంవత్సరం తెలుగు, సంస్కృతం పరీక్షలు మొదటి రోజు కావడంతో విద్యార్థులు ఆలయాల్లో హాల్ టిక్కెట్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పరీక్ష కేంద్రాల వద్ద హడావుడిగా తమకు కేటాయించిన గదులను చూసుకుంటూ కనిపించారు. పోలీసులు కేంద్రాల వద్ద బందోబస్తు నిర్వహించారు.

■ గురజాలలో నవోదయ పరీక్ష కేంద్రంలో 367 మందికి గాను 353 మంది విద్యార్థులు, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 453 మందికి గాను 440 మంది విద్యార్థులు హాజరైనట్లు ప్రిన్సిపల్స్ పుల్లారెడ్డి, ఎస్‌వీ కృష్ణారెడ్డి తెలిపారు.

పిడుగురాళ్ల: ఇంటర్ మీడియెట్ మొదటి సంవత్సరం పరీక్షలు శనివారం పట్టణంలోని నాలుగు పరీక్ష కేంద్రాలల్లో ప్రారంభమయ్యాయి. ప్రభుత్వ జూనియర్ కళాశాల కేంద్రంలో 260 మంది, స్కాలర్స్ కళాశాలలో 289, ఆక్స్‌ఫర్డ్ కళాశాల కేంద్రంలో 597, నారాయణ జూనియర్ కళాశాల కేంద్రంలో 370 మంది పరీక్షలకు హాజరయ్యారు. మొత్తం నాలుగు సెంటర్లల్లో 1,516 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు.

దాచేపల్లి : నారాయణపురం ప్రభుత్వం జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రంలో మొదటి రోజు పరీక్షకు 504 విద్యార్థులకు గాను 492 మంది హాజరయ్యారు. చీఫ్ సూపరింటెండెంట్ బి. వెంకటేశ్వరరావు పర్యవేక్షించారు.

వ్యవసాయ రంగానికి ఊతమివ్వని బడ్జెట్


ఏపూరి గోపాలరావు

పిడుగురాళ్ల: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వ్యవసాయ బడ్జెట్.. వ్యవసాయ రంగానికి ఏ విధంగా ఊతమిచ్చే విధంగా లేదని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఏపూరి గోపాలరావు శనివారం ఒక ప్రకటనలో విమర్శించారు. ఈ సందర్భంగా గోపాలరావు మాట్లాడుతూ... ప్రస్తుత కాలంలో మిర్చి పంటకు గిట్టుబాటు ధర లేక రైతులు తీవ్ర ఆవేదనకు గురవుతుంటే ప్రభుత్వం భరోసా కల్పించే చర్యలు తీసుకోలేదన్నారు.

ధరల స్థిరీకరణ పథకం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం క్వింటా మిర్చికి రూ. 20 వేల మద్దతు కల్పించి, కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. శనగ, కంది రైతులు కూడా సరైన ధర లేక నష్టాల బాటపడుతున్నారన్నారు. వ్యవసాయ రంగానికి సంతృప్తి కలిగించే విధంగా బడ్జెట్ లేకపోవంటం రైతుల పట్ల, వ్యవసాయ రంగం పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని ప్రశ్నిస్తోందన్నారు. అన్నదాత సుఖీభవ ఎన్నికల ముందు రాష్ట్ర ప్రభుత్వం మాత్రమే ఇస్తుందని చెప్పి, నేడు కేంద్రంతో కలిపి రూ.20 వేలు ఇస్తామనడం రైతులను దగా చేయడమేనన్నారు. వరికపుడిశాల ప్రాజెక్టు శంకుస్థాపనలకు మాత్రమే పరిమితం అవుతుంది తప్పా.. ఆ ప్రాజెక్టు నిర్మాణానికి బడ్జెట్టుల్లో నిధులు మాత్రం నోచుకోవడం లేదన్నారు. దీనిని బట్టి వెనుక బడిన ప్రాంతాల పట్ల, తాగునీటి ప్రాజెక్టుల పట్ల పాలకులకు చిత్తశుద్ధి లేదని తెలుస్తుందన్నారు. రైతులకు భరోసా కల్పించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. లేకుంటే రాబోయే కాలంలో రైతుల అగ్రహానికి గురికావాల్సి వస్తుందని ఈ సందర్భంగా గోపాలరావు హెచ్చరించారు.

సంపద కేంద్రాలను వినియోగంలోకి తేవాలి


సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎల్‌పీవో లక్ష్మణరావు

శావల్యాపురం: గ్రామాల్లో చెత్త సంపద కేంద్రాలను వినియోగంలోకి తేవాల్సిన బాధ్యత పంచాయతీ కార్యదర్శులదేనని డీఎల్‌పీవో వి.వి.ఎం.లక్ష్మణరావు చెప్పారు. శనివారం మండలంలోని మతుకుమల్లి, బొందిలిపాలెం గ్రామాల్లోని సంపద కేంద్రాలను ఆయన సందర్శించారు. డీఎల్‌పీవో లక్ష్మణరావు మాట్లాడుతూ సిబ్బందికి సూచనలుచేశారు.

కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ముంద్రు హనుమంతరావు, ఈవోపీఆర్డీ పి.సుగుణ, పంచాయతీ కార్యదర్శి బాలపరమేశ్వరరావు, సచివాలయ ఇంజినీరు రంతు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

'స్నేహ హస్తాలు' సౌజన్యంతో పాఠశాలకు ఫెన్సింగ్


ఫెన్సింగ్‌ను ప్రారంభిస్తున్న ఎంఈవో గణేష్

అచ్చంపేట: మండలంలోని నీలేశ్వరపాలెం గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణలోకి పశువులు, అసాంఘిక శక్తులు ప్రవేశించకుండా ఉండేందుకు స్నేహ హస్తాలు ఫౌండేషన్, గ్రామస్తుల సంయుక్త సహకారంతో పాఠశాల చుట్టూ నిర్మించిన ఫెన్సింగ్‌ను ఎంఈవో మాచవరపు గణేశ్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ పాఠశాల ఆవరణలో పశువులు ప్రవేశించడంతో ఆవరణ మొత్తం అపరిశుభ్రంగా ఉండటం వల్ల విద్యార్థులు చదువుపై ఏకాగ్రత పెట్టలేని పరిస్థితులను ఎదుర్కోవలసి వచ్చేదన్నారు. విషయం తెలుసుకున్న స్నేహ హస్తాలు ఫౌండేషన్, గ్రామస్తులు ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తామని ముందుకు రావడం అభినందనీయమన్నారు. దీనికి మొత్తం రూ.1.20 లక్షలు ఖర్చు కాగా, రూ.60 వేలు స్నేహ హస్తాలు, రూ.60 వేలు గ్రామస్తులు భరించినట్లు చెప్పారు. కార్యక్రమంలో అచ్చంపేట స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ చిగురుపాటి కళ్యాణి, సర్పంచ్ రామావతు కోటేశ్వరనాయక్, ఎస్ఎంసీ చైర్మన్ కొట్టె నరేష్, హెచ్ఎం నంద్యాల శివకుమారి, స్నేహ హస్తాలు కో ఆర్డినేటర్ తాయి కరిముల్లాబాబు, సభ్యులు తుమ్మా శౌర్రెడ్డి, ఉపాధ్యాయులు బత్తుల సాంబశివరావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మార్చి మొదట్లోనే మండుతోంది..



రెంటచింతల: భానుడు భగ్గుమంటున్నాడు. మార్చి నెల ప్రారంభంలోనే తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. నిన్నమొన్నటి వరకు 35 నుంచి 36 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదు కాగా శనివారం అత్యధికంగా 38.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. రెంట చింతలలో మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 3.30 గంటల వరకు ఎండ తీవ్రత ప్రభావం కనిపించింది. మాచర్ల–గుంటూరు ప్రధాన రహదారితో పాటు అంతర్గత రోడ్లు బోసిపోయాయి.

అత్యుత్తమ ఫలితాలు సాధించాలి



విజయపురిసౌత్: పీటీజీ పాఠశాల విద్యార్థులు 10 తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించాలని ప్రిన్సిపల్ శ్యామ్యూల్ జోబ్ అన్నారు. శనివారం పాఠశాలలో ఫేర్ వెల్ డే ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ పాఠశాలలో చదువుకున్న విద్యార్థులు అత్యున్నత స్థానాల్లో ఉన్నారన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పలువురు నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆటో, ద్విచక్ర వాహనం ఢీ

గురజాల: ఆటో ద్విచక్ర వాహనం ఢీకొని ఇద్దరికి గాయాలైన ఘటన శనివారం ఉదయం చోటుచేసుకుంది. వివరాల ప్రకారం.. గురజాలకు చెందిన మెకానిక్ షేక్ షరీఫ్ ఆటోను టెస్టింగ్ నిమిత్తం బస్టాండ్ సమీపంలో తిప్పుతున్నాడు. ఎదురుగా ద్విచక్ర వాహనంపై వస్తున్న కె.రమేష్ ఆటోను ఢీ కోట్టాడు. ఈ ప్రమాదంలో ఇద్దరి తలకు గాయాలైయ్యాయి. వెంటనే క్షతగాత్రులను గురజాల సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించి, వైద్య పరీక్షలు నిర్వహించారు.

మోడల్ స్కూల్ ఆరో తరగతి ప్రవేశానికి ఆహ్వానం

నాదెండ్ల: చిరుమామిళ్ల ఏపీ మోడల్ పాఠశాలలో 2025–26 విద్యా సంవత్సరానికి ఆరో తరగతిలో చేరేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ రూనీస్వాణి తెలిపారు. ఐదో తరగతి పూర్తయిన విద్యార్థులు ఆన్‌లైన్‌లో మార్చి 31లోగా దరఖాస్తులు చేసుకోవాలని పేర్కొన్నారు. ఓసీ, బీసీలకు పరీక్ష ఫీజు రూ.150లు కాగా, ఎస్సీ ఎస్టీ విద్యార్థులు రూ.75 పరీక్ష ఫీజు చెల్లించాలన్నారు. మీ–సేవ కేంద్రాలు, పాఠశాలలో నేరుగా గానీ దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

రెంటచింతల ఏరియాలో బ్లాక్ స్పాట్‌లు లేవు


రెంటచింతల పరిధిలోని నేషనల్ హైవే వద్ద పరిశీలనలో సీఐ రమేష్ బాబు, అధికారులు

రెంటచింతల: మండలంలో మాచర్ల – దాచేపల్లి బైపాస్ రోడ్డు (ఎన్‌హెచ్–167 ఏడీ) నిర్మాణంలో భాగంగా రెంటచింతల ఏరియాలో ఎక్కడా బ్లాక్ స్పాట్‌లు లేవని నేషనల్ హైవే రోడ్డు సేఫ్టీ సీఐ రమేష్ బాబు తెలిపారు. శనివారం ఆయన నేషనల్ హైవే రోడ్డు సేఫ్టీ అధికారులతో కలిసి రెంటచింతల మండల పరిధిలోని బైపాస్ రోడ్డులో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కడెక్కడ ఉన్నయో పరిశీలించి, మాట్లాడారు. రెంటచింతల, మిట్టగుడిపాడు, పాలువాయి జంక్షన్ గ్రామాల పరిధిలో ఎక్కడా బ్లాక్ స్పాట్‌లు లేవని గుర్తించినట్లు తెలిపారు. ఒకచోట జరిగే ప్రమాదంలో ఐదుగురు వ్యక్తులు మరణించిన, 10 మంది ఒకేసారి గాయపడిన ఆ ప్రాంతాన్ని బ్లాక్ స్పాట్‌గా గుర్తించడం జరుగుతుందన్నారు. రెంటచింతల మండల పరిధిలో అటువంటి బ్లాక్ స్పాట్లు లేని కారణంగా మూల మలుపులు, క్రాసింగ్‌ల వద్ద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేసి ప్రమాదాల నివారణ చర్యలు చేపడతామన్నారు. బైపాస్ నిర్మాణం సుమారు 4.2 కి.మీ పరిధిలో ఉంటుందన్నారు. మొత్తం 43 కి.మీ పొడవు, 10 మీటరల వెడల్పుతో చేపట్టిన ఈ ఎన్‌హెచ్– 167 ఏడీ రెండు లేన్ల రహదారిలో సుమారు 21.6 కి.మీ వరకు బైపాస్ ఉందన్నారు. ఈ రహదారి నిర్మాణం వల్ల ప్రమాదాలు తగ్గుతాయన్నారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవడం, వాహనాలలో అధికలోడు వేసుకోవడం చట్టరీత్యా నేరమని మాచర్ల మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ శేషిరెడ్డి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నేషనల్ హైవే రోడ్డు సేఫ్టీ డీఈ రమణయ్య, నేషనల్ హైవే టీం సభ్యులు మద్దాలి శ్రీను, ఎస్ఐ సీహెచ్ నాగార్జున తదితరులున్నారు.

భయం వీడి ఉన్నత మార్కుల సాధించాలి


మాట్లాడుతున్న ఎంబీఎస్ కోటేశ్వరరావు

మాచర్ల: పదవ తరగతి విద్యార్థుల్లో పబ్లిక్ పరీక్షల్లో మంచి మార్కులు సాధించేందుకు మోటివేషన్ ఎంతగానో ఉపయోగపడుతుందని వాసవి క్లబ్ మాచర్ల చెన్నకేశవ జోన్ చైర్మన్ ఓరుగంటి చెన్నకేశవరావు అన్నారు. శనివారం పట్టణంలోని రైల్వేగేటు ప్రాంతంలోని జెడ్పీహెచ్ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులకు ఎంబీఎస్ కోటేశ్వరరావు మోటివేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా చెన్నకేశవ రావు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి మంచి మార్కులు సాధించేందుకు సులభతరమైన విధానాన్ని అలవర్చుకునేందుకు ఈ మోటివేషన్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. వాసవి క్లబ్ మాచర్ల చెన్నకేశవ వ్యవస్థాపక అధ్యక్షుడు తిరివీధి వెంకట నాగేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థుల్లో కొందరికి సహజంగా పరీక్షలంటేనే కొంత భయం ఉంటుందన్నారు. మోటివేటర్ కోటేశ్వరరావు, జిల్లా సభ్యులు మేడం నాగేశ్వరరావు, సెక్రటరీ బచ్చు రాజ్‌కుమార్, రవితేజ, సాంబశివరావు, సత్యనారాయణ, నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, రామారావు, సుబ్బారావు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలి


అధికారుల సమీక్షలో డీఆర్‌డీఏ పీడీ హీరాలాల్ సామారియా

నకరికల్లు: వేసవి కాలం దృష్ట్యా మండలంలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని డీఆర్‌డీఏ పీడీ హీరాలాల్ సామారియా ఆదేశించారు. నకరికల్లులో పింఛన్ పంపిణీ కార్యక్రమాన్ని శనివారం పరిశీలించారు. పలువురు లబ్ధిదారులకు పింఛన్‌ను స్వయంగా అందజేశారు. అనంతరం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీరాజ్ అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పింఛన్ పంపిణీలో ఇబ్బందులు తలెత్తకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నీటి ఎద్దడి ఉండే గ్రామాలను గుర్తించి ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. ఏ గ్రామంలోను తాగునీటి సమస్య రాకూడదన్నారు. ముందుగా గ్రామాల్లో పర్యటించి బోర్లు, రక్షిత మంచి నీటి కొళాయిలు పరిశీలించాలని, మరమ్మతులకు గురైన చోట వెంటనే సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ కె.వి.శివప్రసాద్, పంచాయతీరాజ్ ఏఈ సురేష్, సీసీ కనకారావు, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

ఏపీ గురుకుల బాలుర పాఠశాలలో ప్రవేశాలకు ఆహ్వానం

చిలకలూరిపేటటౌన్: రాజాపేట గ్రామంలోని ఏపీ గురుకుల బాలుర పాఠశాలలో 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి 5వ తరగతి ప్రవేశాలకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.సుబ్రహ్మణ్యం తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ తమ పాఠశాలలో ఐదో తరగతి ప్రవేశాలకు 80 సీట్లు, అలాగే ఆరు ఏడు ఎనిమిది తరగతులలో మిగిలి ఉన్న ఖాళీలకు సంబంధించి ప్రవేశాలకు కూడా దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు వెల్లడించారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 31వ తేదీలోగా తమ వెబ్సైట్ aprr.apcfrr.in ద్వారా ఆన్లైన్లో దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఏప్రిల్ 25వ తేదీన పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కనుల పండువగా సత్తెమ్మతల్లి, సత్యదేవుల కల్యాణం


సత్తెమ్మతల్లికి చండీ హోమం నిర్వహిస్తున్న దృశ్యం

అచ్చంపేట: మండలంలోని మాదిపాడు పంచాయతీ పరిధిలోని అడవిలో స్వయంభు సత్తెమ్మతల్లి, సత్యదేవుల కల్యాణ మహోత్సవం శనివారం కనుల పండువగా జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారికి శ్రీలక్ష్మీ గణపతి హోమం, చండీ హోమం నిర్వహించారు. గత 41 రోజులుగా అమ్మవారి దీక్ష చేపట్టిన భక్తులు మాల విరమణ కార్యక్రమన్ని చేపట్టారు. యర్రంశెట్టి శ్రీనివాసరావు, సత్యవతి దంపతులు 108 మట్టి కలశాలతో సత్తెమ్మతల్లి, సత్యదేవుల ఉత్సవ మూర్తులకు పాలాభిషేకం చేశారు. మహిళలు కుంకుమార్చనలు నిర్వహించారు. అనంతరం కల్యాణ మహోత్సవాన్ని యర్రంశెట్టి శ్రీనివాసరావు దంపతులచే మేడేపల్లి అప్పయ్యశాస్త్రి శాస్త్రోక్తంగా జరిపించారు. అనంతరం భక్తులు భజన కార్యక్రమాలు, కోలాట ప్రదర్శనలు చేశారు. పలు గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి సత్తెమ్మతల్లి, సత్యదేవుల కల్యాణాన్ని తిలకించి అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.